క్లుప్తంగా

విద్యుత్ లైన్ పునరుద్ధరణ



విద్యుత్ లైన్ పునరుద్ధరిస్తున్న విద్యుత్ సిబ్బంది

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట రైస్ మిల్ వెనుక కాలనీలో విద్యుత్ లైన్‌లో ఏర్పడిన సమస్య కారణంగా శనివారం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి స్పందించి విద్యుత్ అధికారులతో మాట్లాడడంతో ఆదివారం విద్యుత్ లైన్‌ను పునరుద్ధరించారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. రంగంపేట మంచి నీటి పథకానికి ఉన్న పాత మోటర్ పాడై గ్రామస్తులు ఇబ్బందులు పడుతుండడంతో సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి కొత్త మోటర్ ఏర్పాటు చేయించారు.

ఉచిత వైద్య శిబిరం



సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజేష్

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో రాజమహేంద్రవరానికి చెందిన హరిత న్యూరో సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం హరిత న్యూరో సెంటర్ న్యూరో ఫిజీషియన్, స్ట్రోక్ వైద్యనిపుణులు డాక్టర్ క్రొవ్విడి రాజేష్, డాక్టర్ సత్యం రమేష్‌బాబు రోగులకు ఉచిత వైద్యసేవలు అందించారు. పక్షవాతం, పార్కిన సన్ వ్యాధి, మతిమరుపు, మెదడు వాపు, వెన్నుపాము వ్యాధులు, నరముల వ్యాధులకు సంబంధించి 60 మంది రోగులను పరీక్షించి, వైద్యసేవలు అందించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, యన్నమని వెంకటనారాయణ, ఎన్.రామరాజు, శేఖర్, ఎస్.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నందరాడలో ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరం

రాజానగరం: మండలంలోని నందరాడలో డెల్టా ఆస్పత్రి సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లంక దొరబాబు, కాశీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 160 మంది రోగులకు డాక్టర్ మెర్సీ ప్రశాంతి, డాక్టర్ మౌనిక వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

హెచ్‌పీ గ్యాస్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం

10 లక్షల ఆస్తి నష్టం



కడియంలోని హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం నుంచి వెలువడుతున్న పొగలు

కడియం: మండల కేంద్రమైన కడియంలోని శ్రీ వెంకట శశి హెచ్‌పీ గ్యాస్ కంపెనీ కార్యాలయంలో ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.పది లక్షల మేర ఆస్తినష్టం సంభవించిందని హెచ్‌పీ గ్యాస్ డీలర్ జి.రాజశేఖర్ తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కడియం శ్రీనగర్‌కాలనీ నుంచి భాస్కర్‌నగర్‌కు వెళ్లే రోడ్డులో ఇటీవలే కొత్తగా నిర్మించిన భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో హెచ్‌పీ గ్యాస్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. భవనం పైఅంతస్తుల్లో నిర్మాణ పనులు ఇంకా జరుగుతున్నాయి. అయితే ఆదివారం ఉదయం పెయింట్ పనులు చేసేందుకు కార్మికులు సదరు భవనం వద్దకు వచ్చేసరికి హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం షట్టర్ల నుంచి పొగలు రావడాన్ని గమనించారు. వెంటనే భవన యజమాని, గ్యాస్ డీలర్‌కు సమాచారం ఇచ్చారు. వారొచ్చి షట్టర్ తెరచే సరికి లోపల మంటలు చెలరేగుతున్నాయి. ఈ ప్రమాదంలో కంప్యూటర్లు, ప్రింటర్లు, సురక్ష ట్యూబ్‌లు, రెగ్యులేటర్ తదితర వస్తువులతో పాటు, కార్యాలయం ఇంటీరియర్ మొత్తం కాలిబూడిదైపోయింది. రాజమహేంద్రవరం ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా వచ్చి మంటలను ఆర్పివేశారు. కాగా ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణంగా భావిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కడియం పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదాతను ముంచిన వాన

- 14,500 ఎకరాలలో దెబ్బతిన్న వరి నాట్లు
- నారు కోసం రైతుల పాట్లు
- ముందుగా నాటిన చోట్ల దుబ్బు కడుతున్న వైనం



సీతానగరం మండలంలో నీట మునిగిన వరి పొలాలు



నరేంద్రపురంలో దుబ్బు చేస్తున్న వరి పొలాలు

రాజానగరం: అల్పపీడనం, తుపానుల ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు గోదావరి వరద తోడవడంతో ఖరీఫ్ వరి నాట్లు వేసిన పలు ప్రాంతాల్లో పొలాలు ముంపుబారిన పడ్డాయి నియోజకవర్గంలో సుమారు 14,500 ఎకరాలలో వరి నాట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు ఆలస్యమైన తరుణంలో ప్రకృతి ఈ విధంగా ఆగ్రహించడం అన్నదాతలకు కునుకు లేకుండా చేసింది.

రాజానగరం, అనపర్తి నియోజవర్గాలలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 93,650 ఎకరాలలో వరి సాగు జరిగింది. దీనిలో అనపర్తి నియోజకవర్గంలో సాగు చేసిన 46,500 ఎకరాలకు వర్షాల వల్ల పెద్దగా నష్టం లేకపోయినా, రాజానగరం నియోజకవర్గంలో సాగు చేసిన 47,650 ఎకరాలలో 13,500 ఎకరాలలో వేసిన వరి నాట్లు ముంపునకు గురయ్యాయి. సాధారణంగా ముంపు నీరు మూడు నుంచి ఐదు రోజులు నిల్వ ఉంటే పెద్దగా నష్టం ఉండదు. అయితే రెండు వారాలకు పైబడి వరి నాట్లు నీట మునిగివుండటంతో అవి పూర్తి కుళ్లిపోయాయి. నీరు తీసిన తరువాత తిరిగి నాట్లు వేసుకోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. జూలై నాటికి వరి నాట్లు వేయడం పూర్తి కావలసిన తరుణంలో వర్షాల కారణంగా చాలా ప్రాంతాలలో సకాలంలో నాట్లు పడలేదు. ఆలస్యంగా వేసిన ప్రాంతాలలో వేసిన నాట్లు ముంపు బారిన పడ్డాయి. ఈ తరుణంలో తిరిగి నాట్లు వేసుకునేందుకు నారు కొరత ఏర్పడింది. విత్తనాలు చల్లి, నారు పెరిగిన తరువాత నాట్లు వేయాలంటే సమయం ఇప్పటికే మించిపోవడంతో నారు కోసం రైతులు పాట్లు పడుతున్నారు.

నేరుగా వెదజల్లడం మంచిది

ప్రస్తుత సమయంలో నారు పోసి, నాట్లు వేయాలంటే సమయం చాలదు కాబట్టి నేరుగా విత్తనాలు వెదజల్లడం మంచిదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. లేకుంటే తక్కువ కాలం వరి వంగడాలను ఎంచుకోవాలని సూచిస్తున్నారు. ఇటువంటి సమయంలో మెరక ప్రాంతంలో సామూహికంగా నారు వేసుకుంటే పల్లపు ప్రాంతంలో రైతులకు ఉపయుక్తంగా ఉంటుందంటున్నారు. ఎంటీయూ 1153, ఎంటీయూ 1156 వంటి స్వల్పకాలిక వంగడాలను సూచిస్తున్నారు. ఈ వంగడాలు 125 రోజుల కాలవ్యవధిలో దిగుబడులనిస్తాయి. ఎంటీయూ 1061, ఎంటీయూ 1239 రకాలు 145 రోజులలో దిగుబడికి వస్తాయి. వీటిని సబ్సిడీపై ఆర్‌బీకేల ద్వారా సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు.

ఆలస్యంగా నాట్లు వేసిన చోట్ల నష్టం

మండలంలో నరేంద్రపురం, నందరాడ, కలవచర్ల, తూర్పుగానుగూడెం, వెలుగుబంద, మురారి, తోకాడ, కానవరం, ఫరిజల్లిపేట, ముక్కినాడ ప్రాంతాల్లో జూన్ నెలలోనే నాట్లు వేయడంతో ప్రస్తుతం ఆ పొలాలలో వరి పంట దుబ్బు కట్టడం, చిరుపొట్ట దశకు చేరుకున్నాయి. భారీ వర్షాల ప్రభావం ఈ ప్రాంతంలో పెద్దగా లేదు. కోరుకొండ, సీతానగరం మండలాలతోపాటు ఆలస్యంగా నాట్లు వేసిన రాజానగరం మండలంలోని సంపత్‌నగరం, తుంగపాడు, నామవరం, కొండగుంటూరు ప్రాంతాలలో 14,500 ఎకరాలలో వరి నాట్లు దెబ్బతిన్నాయి.

ముంపునకు గురైన పొలాల్లో సస్యరక్షణ చర్యలు



ముంపునకు గురైన పొలాల్లో నీరు తీసిన వెంటనే బూస్టర్ డోస్ రూపంలో ఎకరానికి 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కలిపి చల్లడం ద్వారా వరి పంటను కాపాడుకోవచ్చు. తెగుళ్ల సోకకుండా ఒక లీటరు నీటిలో కార్బండిజమ్ ఒక గ్రాము కలిపి పిచికారీ చేయడం మంచిది. అయితే వర్షాలకు ముందు వేసిన నాట్లు 5 రోజులకు పైబడి నీట మునిగివుంటే పనికిరావు. వాటి స్థానంలో మళ్లీ నాట్లు వేసుకోవాలి. ఈ సమయంలో తక్కువ కాలవ్యవధితో కూడిన వరి వంగడాలను ఎంచుకోవడం మంచిది. నారు దొరకకపోతే వెదజల్లు పద్ధతిలో నేరుగా విత్తనాలను చల్లుకోవచ్చు.

– డాక్టర్ చల్లా వెంకటనరసింహరావు, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, దివాన్‌చెరువు

నారు దొరకడం లేదు



సంపత్‌నగరంలో సుమారు 25 ఎకరాల్లో వేసిన వరి నాట్లు ముంపునకు గురై పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిలో తిరిగి నాట్లు వేయవలసి ఉంది. ప్రస్తుత సమయంలో వరి నారు దొరకడం లేదు. ఇప్పటికే ఎకరానికి సుమారు రూ.15 వేల వరకు ఖర్చు అయింది. మళ్లీ నారు అంటే ఈ ఖర్చు మరింత పెరుగుతుంది. ఆలస్యం కావడం వలన దిగుబడులు ఏవిధంగా ఉంటాయోననే భయం కూడా ఉంది.

– పి.రామకృష్ణ, రైతు, సంపత్‌నగరం

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధిలో ఆదివారం స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి వ్రత పూజలు జరిపారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. భక్తుల కోసం ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని చినకొండేపూడి–పెదకొండేపూడి రోడ్డులోని కోళ్ల ఫారమ్‌లో కూలికి వచ్చిన పెదకొండేపూడికి చెందిన కారంకుల కొండయ్య (38) విద్యుదాఘాతానికి మృతిచెందాడని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు ఆదివారం తెలిపారు. కొండయ్య శనివారం రాత్రి 8 గంటలకు కోళ్లు పట్టుకునే పనికి వెళ్లాడు. పనులు చేస్తున్న క్రమంలో అర్ధరాత్రి 1.30 గంటలకు తెగిపడి ఉన్న విద్యుత్ వైర్ తగిలి షాక్‌కు గురై మరణించాడు. మృతునికి భార్య దుర్గ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు తెలిపారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డికి ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కడుతున్న చిన్నారులు

పెదపూడి: ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం గ్రామగ్రామాన స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకూ ఒకరికొకరు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. చిన్నారులు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని రోజంతా ఆనందోత్సాహాలతో గడిపారు. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. రామవరం గ్రామంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, గ్రామ ఉపసర్పంచ్ సబ్బెళ్ల కృష్ణారెడ్డికి పలువురు చిన్నారులు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టారు.

యామినీ కృష్ణమూర్తికి భట్రాజుల సంఘం నివాళి



కృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

సీటీఆర్ఐ: యామినీ కృష్ణమూర్తి జీవితం నృత్యానికి అంకితమని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా భట్రాజుల సంఘం అధ్యక్షుడు సేవారత్న లోలభట్టు శ్రీనివాసరాజు కొనియాడారు. ఆదివారం స్థానిక జేఎన్‌రోడ్డు షిర్డీ సాయి మార్గ్‌లో గల హెరిటేజ్ రాయల్ అపార్ట్‌మెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో పద్మశ్రీ , పద్మ విభూషణ్ స్వర్గీయ యామినీ కృష్ణమూర్తి మృతికి భట్టరాజ సంఘ సభ్యులు శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబేపల్లి వాసి భారతీయ నర్తకి పద్మశ్రీ యామిని కృష్ణమూర్తి (84) భట్రాజుల కులానికి వన్నె తెచ్చారని, భరతనాట్యం కూచిపూడి, ఒడిస్సీ నృత్యాలలో నిష్ణాతురాలిగా పేరు తెచ్చుకున్నారన్నారు. ముంగర కృష్ణమూర్తి రాజు దంపతులకు 1940 డిసెంబర్ 20న జన్మించిన ఆమె మరణం శోచనీయమన్నారు. ఆమె దేశ విదేశాలలో అనేక ప్రదర్శనలు ఇచ్చి భారతమాత సిగలో జాబిలమ్మలా ప్రజలకు గుర్తుండిపోతారన్నారు. 17 ఏళ్ల వయసుకే పద్మశ్రీ అవార్డును సంపాదించిన ఘనత ఈమెదన్నారు. అంతర్జాతీయ స్థాయిలో కూచిపూడి నాట్యానికి ఖ్యాతి రావడానికి చాలా కాలం ముందే ఈమె అమెరికా, ఐరోపా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ,ఇండోనేషియా వంటి దేశాలలో నృత్యాభినయం చేశారన్నారు. కార్యదర్శి చల్లగాలి వెంకటరామరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కార్యభట్టు రవీందర్‌రాజు పాల్గొన్నారు.

8న సర్వ సభ్య సమావేశం

పెదపూడి: పెదపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నామని ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ గత మూడు నెలలుగా జరిగిన అభివృద్ధి పనుల ప్రగతిపై సమావేశంలో ఆయా శాఖాధికారులు వివరిస్తారన్నారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



కడియం దేవీచౌక్ సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ తులసీధర్, సిబ్బంది

కడియం: నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తులో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ అన్నారు. మండల కేంద్రమైన కడియంలోని దేవీ సెంటర్‌లో సీసీ కెమెరాలను ఆయన ఆదివారం పరిశీలించారు. గతంలో పోలీసులు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కెమెరాల నిర్వహణా లోపంతో పనిచేయడం లేదన్నారు. దీంతో మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని సుమారు పదివేల రూపాయలతో వాటిని పునరుద్ధరించారన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వంద మంది పోలీస్ సిబ్బందితో సమానమని, సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని, గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తులసీధర్ కోరారు. స్వీయ రక్షణ కోసం కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అన్నారు. వారిని సక్రమమైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. మహిళలకు, బాలికలకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. అనంతరం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఏకకాలంలో పెద్ద సంఖ్యలో వాహనాల తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా, ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఎస్సైలు టి.దుర్గాప్రసాద్, కృష్ణసాయి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిజమైన స్నేహితుడు ఏసుక్రీస్తు



వాక్య సందేశాన్నిస్తున్న రెవరెండ్ ఫాదర్ మాణిక్యం

మధురపూడి: నిజమైన స్నేహితుడు ఏసుక్రీస్తు అని ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రెవరెండ్ మాణిక్యం అన్నారు. ఆదివారం కోరుకొండ ఎస్సార్ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా వాక్య సందేశంలో ఆయన మాట్లాడుతూ క్రైస్తవులు స్నేహితుల దినోత్సవం నిర్వహించుకోవాలన్నారు. క్రీస్తు బోధనల ప్రకారం సహోదర భావాన్ని సమాజానికి అందించాలన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ప్రార్థనల్లో ఉపదేశి బెల్లపు డేవిడ్, అంథోనీ, బూసి వసంతకుమార్, వరమ్మ, సంధ్యారాణి పాల్గొన్నారు.

చిత్ర బృందం సందడి



శివజ్యోతి థియేటర్‌లో సందడి చేస్తున్న చిత్రబృందం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): శ్రీ నీలకంఠం మహాదేవ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణ సంస్థ సారథ్యంలో రాజమహేంద్రవరానికి చెందిన పవన్ కుమార్ కొత్తూరి నటించి, దర్శకత్వం వహించిన యావరేజ్ స్టూడెంట్ నాని చిత్రం యూనిట్ నగరంలో శనివారం రాత్రి సందడి చేసింది. స్థానిక శివజ్యోతి థియేటర్లో ప్రదర్శితమవుతున్న యావరేజ్ స్టూడెంట్ నాని చిత్ర ప్రదర్శనను సెకండ్ షోకు యూనిట్ చిత్రబృందం అభిమానుల మధ్య తిలకించింది. ఈ సందర్భంగా నటుడు, చిత్ర దర్శకుడు పవన్ కుమార్ కొత్తూరి మాట్లాడుతూ ఈ చిత్రం అన్ని వర్గాల వారిని ముఖ్యంగా యూత్‌ను అలరించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ చిత్రాన్ని గోదావరి నది, కడియం పూల మొక్కల నర్సరీల అందాల మధ్య చిత్రీకరించినట్లు తెలిపారు. హీరోయిన్‌లు సారా, బిశాల్ గోయల్ మాట్లాడుతూ తాము పోషించిన పాత్రలు కథతో ముడిపడి ఉంటాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి పాత్రలు లభిస్తాయని అభిలషించారు. ఈ చిత్రాన్ని యూత్ ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ చిత్రానికి నిర్మాతలు పవన్ కుమార్ కొత్తూరి, బిశాల్ గోయల్. సంగీతం కార్తీక్ కొడకండ్ల, ఫైట్స్ నందు, కొరియోగ్రఫీ రాజు పాడే.

కార్పొరేషన్ రాబడికి నిబంధనల గండి

- షాపుల వేలం ఎప్పుడో మరి?
- నాలుగేళ్లుగా మూసి ఉన్న నాలుగు షాపులు
- ఎనిమిది సార్లు వేలం ప్రకటించినా ముందుకు రాని వ్యాపారులు
- అద్దె ఎక్కువ కావడంతో భయపడుతున్న వైనం




దానవాయిపేటలో మూతపడి ఉన్న నగర పాలక సంస్థ షాపులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన షాపులను అద్దెకు ఇవ్వడంలో అధికారులు శ్రద్ధ కనపరచడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగర వ్యాప్తంగా 39 ప్రాంతాల్లో 690 షాపులను నగర పాలక సంస్థ నిర్మించి అద్దె ప్రాతిపదికన చిరు వ్యాపారులకు అందించింది. నగరంలో ప్రధాన ప్రాంతమైన దానవాయిపేట గానుగ వీధిలో నాలుగు రోడ్ల జంక్షన్‌లో నాలుగేళ్ల క్రితం నాలుగు షాపులను నిర్మించారు. ఈ భవనం పై అంతస్తులో 12వ నంబర్ వార్డు సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. అయితే నిర్మాణం చేపట్టిన నాలుగు షాపులను నాలుగు సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఇప్పటివరకు చిన్న తరహా వ్యాపారులకు అందించేందుకు చర్యలు చేపట్టకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్ల కాలంలో షాపులను వేలం ద్వారా కేటాయించేందుకు ఇప్పటికి ఎనిమిది సార్లు వేలం ప్రకటించారు. అయితే ఈ వేలంలో పాల్గొని షాపులను పొందేందుకు చిరు వ్యాపారులు సాహసం చేయకపోవడంతో నాలుగేళ్లుగా షాపుల వేలం కొలిక్కిరాలేదు. అయితే నగరపాలక సంస్థకు చెందిన స్థలంలో ఈ షాపుల నిర్మాణానికి నగరపాలక సంస్థ 20 లక్షల రూపాయలు ఖర్చు పెట్టడంతో షాపు ఒక్కొక్క దానికి ఐదు లక్షల ప్రాథమిక ధర నిర్ణయించి వేలం నిర్వహించే చర్యలు చేపట్టారు. దీంతోపాటు నెలకు రూ.16 వేల చొప్పున అద్దె ప్రాతిపదికన వేలం నిర్వహించేందుకు అవసరమైన ప్రకటనను వెలువరిస్తున్నారు. షాపులను కేటాయించేందుకు పలుమార్లు వేలం ప్రకటనకు తేదీలు నిర్ణయించి ప్రకటించినా వ్యాపారులు ఎవరు ఈ షాపులను దక్కించుకునేందుకు పోటీ పడకపోవడంతో నాలుగు సంవత్సరాలుగా షాపులు ఏ విధమైన ఆదాయం లేకుండానే ఉండిపోయాయి. ఈ షాపులను పొందేందుకు వేలంలో ఎవరూ ముందుకు రాకపోవడంతో నగర పాలక సంస్థ ప్రత్యామ్నాయ చర్యలు ఏమీ చేపట్టపోవడంతో నగరపాలక సంస్థ ఆదాయానికి గండిపడుతోంది.

నిబంధనలు సడలిస్తే వేలానికి అవకాశం

షాపులు వేలంలో పాల్గొనేందుకు చిరు వ్యాపారాలు ఎవరు రాకపోవడాన్ని నగరపాలక సంస్థ అధికారులు గమనించినా ఇప్పటి వరకూ ఏవిధమైన చర్యలు పట్టక పోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. షాపుల వేలంలో పాల్గొనేందుకు ముందస్తు సొమ్మును తగ్గించి వేలం నిర్వహించడంతో పాటు షాపుల నెలవారీ అద్దెను తగ్గిస్తే వేలంలో పాల్గొనేందుకు కొందరైనా ఆసక్తి కనబరిచే వారని పలువురు అభిప్రాయపడుతున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మాణం చేపట్టిన షాపులను ఆదాయం లేకుండా వదిలివేయడంతో షాపులు పాడయ్యే అవకాశం ఉంది. ఎప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు చొరవ చూపి, నిబంధనలు సడలించి వేలం నిర్వహించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నగరానికి కొత్తగా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కేతన్ గార్గ్ ఈ షాపులు విషయంలో ప్రత్యేక శ్రద్ధతో ఆలోచించి చిరు వ్యాపారులకు అందించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై నగర పాలక సంస్థ రెవెన్యూ మేనేజర్ శ్రీనివాసరావును వివరణ కోరగా కార్పొరేషన్ నిబంధనల ప్రకారం భవన నిర్మాణం ఖర్చును విభజించి రూ.ఐదు లక్షల ప్రారంభ ధర నిర్ణయించాం. ప్రభుత్వ లెక్కల ప్రకారం షాపు విస్తీర్ణాన్ని ప్రాంతాన్ని అనుసరించి అద్దెను నిర్ణయిస్తామన్నారు.


అధికారులు ఆలోచన చేయాలి



నాలుగేళ్లుగా వేలం నిర్వస్తున్నా చిరు వ్యాపారులు ముందుకు రాకపోవడంపై నగర పాలక సంస్థ అధికారులు ఆలోచన చేయాలి. వేలం పాటలో పాల్గొనేందుకు ముందస్తుగా నిర్ణయించిన రూ.ఐదు లక్షలు పెద్ద మొత్తం కావడంతో వేలంలో పాల్గొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీనిపై అధికారులు పునరాలోచన చేయాలి. ఇప్పటికైనా అధికారులు ఆలోచించి ధర నిర్ణయించాలి

– అదపా అనిల్‌కుమార్, రాజమహేంద్రవరం

అద్దె తగ్గించాలి



రూ.ఐదు లక్షల నుంచి ఆపై ఎంత పెరిగినా అంత సొమ్ము చెల్లించే స్తోమత లేని చిరు వ్యాపారులు వేలంలో పాల్గొనడం లేదు. నెలకు 16 వేల రూపాయల అద్దె ఎక్కువ కావడంతో ఎవరూ ముందుకురావడం లేదు. ఈవిధమైన విధానాల వల్ల నాలుగేళ్ళుగా నగరపాలక సంస్థ ఆదాయానికి లక్షలాది రూపాయల మేర గండి పడింది. అధికారులు ఇప్పటికైనా ఆలోచన మార్చుకుని రేటు తగ్గించి వేలం నిర్వహించాలి. లేని పక్షంలో షాపులు పాడయ్యే ప్రమాదం ఉంది.

– దల్లి రాజశేఖరరెడ్డి, రాజమహేంద్రవరం

పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్కలు పంచి పెడుతున్న శ్రీధర్‌రెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: పర్యావరణ పరిరక్షణకు మనమంతా కృషి చేయాలని జిల్లా భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ అధ్యక్షుడు, యోగ గురువు కేఎస్‌వీ శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలో దానవాయిపేట రౌండ్ పార్కు వద్ద తూర్పుగోదావరి జిల్లా భారత్ స్వాభిమాని ట్రస్ట్, మహిళా పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో ఆచార్య బాలకృష్ణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వనమూలికా దినోత్సవం నిర్వహించారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ జీవన విధానంలో అవసరమైన మూలికలు అందించే మొక్కలు మన చుట్టూనే ఉన్నాయని వాటిని వినియోగించుకోవడం ద్వారా ఆరోగ్యవృద్ధి పొందవచ్చునని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ యోగా ట్రైనీ టీచర్స్ ద్వారా 50కి పైగా అనేక రకాల వనమూలికా మొక్కలను సేకరించి వాటి విశిష్టతను రౌండ్ పార్క్ లో ఉన్న సందర్శకులకు వివరించి, మొక్కలను వారికి ఉచితంగా పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి మహిళా పతంజలి యోగ సమితి అధ్యక్షురాలు వేణు, ఉపాధ్యక్షురాలు కర్రి సత్య లలితా కుమారి, అసిస్టెంట్ యోగ ట్రైనీ టీచర్స్ పాల్గొన్నారు.